శారద

పో. రామచంద్ర రావు గారు, బి. ఏ.

౧. లేఖా గమనము

"శారద! శారద! ఏమిచేయుచుంటివే? ఎవరో పిలుచుచున్నారు చూడు" మని వంటకార్యమునందప్రమత్తయై యున్న యశోద తన తనయ నుద్దేశించి పల్కుటయు శయనాగారమున నాంధ్రగ్రంథపఠనోత్సాహమగ్నమానసయగు శారద తన్మయత్వమునుండి మేల్కాంచి "అమ్మా! పిలిచితివా?" యని తిరుగ ప్రశ్నవేయుటయు, తల్లి పూర్వోక్తప్రకారము పలుకరింప, శారద సింహద్వారమును తెఱచి చూచెను. అంత తపాలవాఁడొకలేఖ "జానకిరావుగారి కీయుఁడని" శారద కొసంగి వెడలిపోయెను.

శారద... మేల్కాంచి "అమ్మా! పిలిచితివా?" యని ప్రశ్న వేసెను.

ఆ కమ్మను కరమున దాల్చినంతనే యా కొమ్మహృదయమున విద్యుల్లతాప్రసారమైన ట్లొకవిధమగు కలజడి కలిగెను. ఒడలు గగుర్పొడిచెను. స్వాంతమారాటపడజొచ్చెను. స్వేదబిందువు లాణిముత్తెపుసరములట్లు కపోలపాళిక నలంకరించెను. ఈ యుత్తలపాటేలొకో?

శారద పదునైదేండ్ల బాలిక. హైందవ సాంప్రదాయానుసారము పదునైదేండ్ల యున్నులమిన్నను బాలిక యని పేర్కొనుట యసంగతమైనను శారదనట్లు వాక్రువ్వవలసి వచ్చెను. శారద శారదాదేవి యపరావతారమనుట యతిశయోక్తి కానేరదు. ఆమె రూపజితశారద. వివిధసద్గుణవిశారద. సకలవిద్యావిశారద. ఆమె జనకుఁడు ధనవంతుఁడును, చిరయశోవిరాజితుఁడును నగు న్యాయవాది మధుసూదనరావు.

మధుసూదనరావు విద్యాధికుఁడు. చెన్నపురియందుత్తమన్యాయవాది పరీక్షయందుత్తీర్ణుఁడై, హేలాపురియందు న్యాయవాదవృత్తి నవలంబించి, యచిరకాలమున నధికధనము నార్జించి, పదివత్సరములైన ముగియుట

మునుపే వృత్తి విరమించి, స్వగ్రామము జేరి యాలుబిడ్డలతో సుఖముగ జీవించుచుండెను. మధుసూదనరావుకు శారదకన్న మూఁడువత్సరము లధికవయస్సుగల జానకిరావను పుత్త్రుఁ డొకఁడుండెను. అతఁడిప్పుడు రాజమహేంద్రపురమున దొరతనమువారి యున్నత కళాశాలలో ప్రథమశాస్త్ర పరీక్షకు చదువుచుండెను. పట్టణావాసమునువీడి పల్లెయందున నివాసము నేర్పరచుకొనిన మధుసూదనరావు తనవృత్తియందువలెనే ప్రస్తుతమునను లుబ్ధత్వమున నపారయశము నార్జించెను. ఊరివారెల్ల రాతనిని గూర్చి "పిల్లికి భిచ్చమైననిడఁడు. తప్పదు గావున తనయునకును, తనయకును విద్యాభ్యాసము చేయించుచున్నాఁడు గాని వారియింట నికవేరువిధమగు వ్యయమేలేదు. ఎంతధనమున్ననేమి?" యని యాడుకొనుచుందురు.

ధనవంతుని కుమార్తెయయ్యు, సుగుణఖనియయ్యు, రూపవతియయ్యు శారద నిజయౌవనమునంతయు నడవిగాచిన వెన్నెలట్లు వృథాచేయుచు, సోదరుఁడు సమీపమునలేని కొఱంతదీర్చుచు, పితృగృహమున నివసింపవలసివచ్చుట కేమికారణము?

౨. వైవాహికపు ముచ్చటలు

శారదకు పదునొకండు వత్సరములు గడచెను. తల్లి యీమెకు వైవాహికోచిత ప్రాయము సంఘటిల్లినది గావున వేగిరము తగుసంబంధము నారయుమని మధుసూదనుని తొందరపెట్ట సాగెను. 'ఇతర సంబంధమైనచో వరకట్నము లాంఛనములు మొదలగువానితో విశేషద్రవ్యము వెచ్చమగు నని తలంచి మధుసూదనరావు చిన్నతనము నుండియు శారదను తనమేనల్లుఁడగు సుబ్బారావున కిచ్చి పరిణయము గావింప దలంచియుండెను. దానికి తోడు సోదరియగు రుక్మిణమ్మకు శారదను గాంచినప్పటినుండియు నామెను తనకోడలిగఁ జేసికొనవలెననియు, ముందుగా చెప్పకున్నను తనయన్న తగిన వరకట్నము నేదోవిధముగ ముట్టచెప్పక మానఁడనియు నామె విశ్వసించియుండెను. చెల్లెలిమూలముననైన తనకార్యము కొనసాగించుకొన నెంచి యొక శుభదివసమున మధుసూదనుఁడు తన బావను సందర్శింప బందరుపట్టణమునకు బయలుదేరెను.

రామారావుగారు బందరుపురమున దొరతనమువారి కొలువులో నున్నాఁడు. ఆయన సుతుఁ డాపురియందలి కళాశాలలో ప్రథమశాస్త్రపరీక్షకు జదువుచున్నాఁడు. సుబ్బారావు విద్యాభ్యాస మొనరించుచు తగిన యుక్తాయుక్తవివేచనజ్ఞాన మలవడు ప్రాయముగలవాఁడై యుండినను మనోదార్ఢ్యమును, స్వశక్తియు లేనివాఁడు. తలిదండ్రులుగాని, మిత్రులుగాని యేదైన నచ్చునట్లు చెప్పినచో తదభిప్రాయమును స్వీకరించి, యాత్మవిజ్ఞానము నణంచికొని, వ్యక్తిత్వమును చంపుకొని, మెలగుచుండు పిఱికివారిలో నొకఁడు. కాని వానికి కొంత పట్టుదలమాత్ర మొక్కొక్కప్పుడు గానవచ్చుచుండును. తన బావమఱఁది కుమార్తెను సుతున కుద్వాహ మొనరించుటకు వచ్చినట్లు తెలిసియుండియు రామారావుగారికీసంబంధ మిష్టము లేకుండు

టుచే నేమియు తెలియనివానివలె నటించుచుండెను. మధుసూదనరావు స్వయముగా నీ ప్రస్తావన తేనిచ్ఛగింపక మిత్రులగు నరసింహారావు మొదలగువారితో ముచ్చటించి, వారి నెట్లయిన రామారావుగారిని సమాధాన పఱుపవలసినదని కోరెను.

మిత్రులు రామారావుగారికి నయవిధి బోధించి కావలసిన సంబంధము కావున నవశ్యము సమ్మతింపవలసినదని ప్రార్థించిరి. కాని కావలసినంత కట్నము గైకొనుట కవకాశ ముండదని లోలోన శంకించి రామారావు వారిహితబోధలను త్రోసిపుచ్చి, వలదని నిరాకరించెను. రామారావుగారి విముఖత్వమున కాశ్చర్యపడుచు మధుసూదనుడు మఱునాడే బయలుదేరి స్వగ్రామము చేరెను.

శ్రావణము ప్రవేశించెను. ఒకదినమున నరసింహారావుగారు తొందరగా న్యాయస్థానమున కేగుచుండ దారిలో రామారావుగారెదురయ్యెను. మిత్రుడుగదా యని నరసింహారావుగారు కుశలప్రశ్న గావించెను. అంతట రామారావుగారు తమయింటికి కానాటిరాత్రి విందుగుడువ రమ్మని మిత్రు నాహ్వానించెను.

"విందా? ఏల?"

"మాఅమ్మాయికి వివాహమైనది. నేడు గృహప్రవేశము"

"మీఅమ్మాయికా? ఏసంబంధము?"

"మేనరికమే"

"మేనరికమా? మొదట మేముచెప్పి నప్పుడు త్రోసివేసితిరే?"

"ఏదో లెండి. ఆడవాళ్ల బాధపడలేక సమ్మతింప వలసివచ్చినది"

"సరి" యని నరసింహారావుగారు వెడలిపోయెను.

క్రమక్రమముగా నరసింహారావుగారికి వైవాహికకాలమున జరుగుముచ్చటలు, లాంఛనాదులగూర్చి యవశ్యముగ తటస్థించు కయ్యములు మొదలగునవి తెలియవచ్చెను. ఆయన లోలోన నవ్వుకొనెను.

౩. అపూర్వ పునస్సంధానము

శారదాంబకు యుక్తవయస్సు ప్రాప్తించెను. మధుసూదనరావుగారు వియ్యంకునకు శుభవార్త నెఱింగించుచు వీలయినంత త్వరలో పునస్సంధాన ప్రయత్నము లొనరింపవలసినదని వ్రాసెను. కొన్ని నెలలు గడచెను. రామారావుగారినుండి ప్రత్యుత్తరము రాలేదు. మధుసూదనరావు తమ పురోహితునకొక శుభముహూర్తనిశ్చయమును తెలుపుకమ్మ వ్రాసియిచ్చి, వియ్యాలవారి సమాధానమును గైకొనిరా నంపెను. పురోహితుని చేతనే తమకుమారునకు ప్రస్తుతము విద్యాభంగము జరుగునుగాన కార్యము నింతలో జరుపవీలులేదని రామారావుగారు కబురంపిరి. మరల కొన్నినెలలైన పిదప కబురులవలన కార్యములేదని మధుసూదనుడే స్వయముగా బయలుదేరి బృందావనమున కేగెను.

మధుసూదనరావొకయర్ధరాత్రమున విషణ్ణహృదయముతో స్వగృహముఁజేరెను. శారద నిద్రాపరవశయైయుండెను. యశోద తలుపు తెఱచినయంతనే "కాయా?పండా?" యని

ప్రశ్నించెను. విషాదముతో "కాయమే. మీ యల్లుఁడు తనకీభార్యవలదనుచున్నాఁడఁట. కొన్నిదినములలో నెట్లయిననమాధానపఱచెదనని మీాయన్నగారు చెప్పినారు. మనప్రారబ్ధమిట్లున్నది. అమ్మాయి కీసంగతి తెలియనీయకుమని" లేనిపోనివి కల్పించిచెప్పి, మధుసూదనుఁడు మంచమెక్కెను. మనోవ్యాధికి మందు లేదందురు. మాసము గడువక మున్నే మనోవ్యాధిచేతనో, మరేకారణముననో మధుసూదనుఁడు మంచముపట్టి మండలదినములలో మానవలోకము వీడి చనెను.

భర్తృమరణదుఃఖమునకు లోగుచుండి నను బాలిక బెంగపెట్టుకొనునేమో యను చింతచే, పాపము యశోద, పుట్టెడు దుఃఖమును లోన నణచుకొని, పట్టికి జామాత ప్రసంగమును తెలియనీయక కాలము గడుపుచుండెను.

ఒకవత్సరము జరిగిపోయెను. బాలికకు యుక్తవయసు ప్రాప్తించి రెండేండ్లయ్యెను. భర్తృసందర్శనము లభింపదయ్యెను. ఒకనాడు జానకిరావు శారదాసహితుఁడై బందరు చేరెను. భర్తృగృహమున కేగుచుంటినని మనసున నలరుచుండినను, మాతను వీడి పోవవలసివచ్చినందులకు విచారించి శారద యెట్టులో కన్నీటితో గ్రామము విడచి పోయెను.

నాటిసాయంకాలమున వారు బందరు చేరిరి. "వయసు వచ్చిన కన్నెను తమయింట నుంచుకొనుట పాడిగాదని తీసికొని వచ్చితి" నని జానకిరావు రామారావుగారి కెఱింగించెను. రామారావుగారు మూఁకీభావము వహించి యూరకుండిరి. సుబ్బారావేదియో పనిమీాఁద గ్రామాంతరమున కేగినట్లు తెలిసెను.

మఱుసటి యుదయమున జానకిరావు చావడియందు వార్తాపత్రికను జూచుకొనుచుండెను. రామారావుగా రచటికేతెంచిరి. పెద్దలుగావున రామారావుగారు వచ్చినంతనే జానకిరావు లేచి నిలచెను. అంతవారి కీసంభాషణ నడచెను.

రా:—"తీసికొని వచ్చితివా?"

జా:—"ఏమిటి?"

రా:—"దస్తావేజులు"

జా:—"దస్తావేజులేమి?"

"ఓ తెలియదా? మీనాన్నగారు క్రిందటి సంవత్సర మిచటికి వచ్చినపుడు వరకట్నము క్రింద పదియకరముల భూమినిత్తుమని చెప్పియుండిరి. ఆసంగతి నీకుగాని మీయమ్మకుగాని చెప్పియుండలేదా?"

జానకిరావాశ్చర్యపరవశుఁడయ్యెను. "ఆహా! ఎట్టికోఱిక కోరుచున్నాఁడు! వరకట్నము క్రింద తనయిల్లుగుల్ల జేసికొని ఉన్నదంతయు తనకిమ్మనియా వీనియుద్దేశము! రామారావుగారు, విశేషధనము సముపార్జించినవాఁడు, ఇంక నార్జించుచున్నవాఁడు, ఏకపుత్రవంతుఁడు, విశేషించి యాధ్యాత్మిక విద్యారహస్యముల నెఱింగిన తత్వజ్ఞానవేత్త, ఇట్టివిడ్డూరపు కోఱికలు కోరుటయా? తనకున్నది చాలకా, పరులకొంపను కూలవేయుటకు ప్రయత్నించుచుండుట? ఇహలోకమును వీడునప్పు

భీషణమునంతయు వెంటగొనిపోవునా?" యని విద్యావంతుఁడును, ఉదారస్వభావుఁడును నగు జానకిరావు వేయివిధముల తలపోసి, ప్రథమ విఘ్న మొనరించుట పాడిగాదని తలంచి ప్రశాంతచిత్తుఁడై "మాఅమ్మ నడిగి తెలియఁ జేసెద"నని చెప్పెను. అంతటితో రామారావుగారు ప్రసంగమును ముగించి వెడలి పోయిరి.

మరునాఁడే జానకిరావు బయలుదేరిపోయి విచారముతో స్వగృహము జొచ్చెను.

శారదకు మామగారి గృహము కారాగృహసన్నిభ మయ్యెను. అగ్నిసాక్షిగ పరిణయమైన భర్త యామెతో నోరువిప్పి యొక నాఁడయిన భాషింపలేదు. అంతకన్నను మిన్నగ మేనమామయయ్యు మామగారి కామెజోలి యక్కఱలేదయ్యెను. మేనయత్త పాపమామెను చాకిరిచేయించుకొను సర్వమగు దాసివలె చూచుచుండెను. ఆమెకు కట్టుకొనుటకుమారు పుట్టముగూడ కఱవయ్యెను. ఆహా! ఒక ధనవంతునికుమార్తె, వేరొకధనవంతుని యొక పుత్రునిభార్య, వేరువస్త్రమయినలేక గడుపవలసివచ్చెగదా!

కాని సుగుణాలవాలయగు శారద సహజ గాంభీర్యమును గోల్పోవక, ఎట్టులెట్టులో వీనినన్నిటిని సహించుకొనియుండెను. మూఁడు మాసములు గడచునప్పటికి ఆహారాదికమందు విముఖత్వముగలిగి, అత్తమామలయొక్కయు భర్తయొక్కయు నిరాదరణకులోనై నిరంతరము మనోవైకల్యమునకులోనై శారద యనారోగ్యవతియయ్యెను. క్రమక్రమముగ నామెకు జ్వర మంకురించెను. ఇదియే మిషగ గొని రామారావుగా రామెనుపుట్టినింటికిఁ దోలివైచి, తలతడవి చూచుకొనెను.

౪. పరిత్యాగము

ఐదు, ఆరు, పదినెలలుగడచెను. శారద కత్తవారియింటనుండి పునరాహ్వానము రాలేదు. ఒకజాబైన లేదు. అందరునామెపై నలుక నహించినవారైన తరుణమున నామెప్రశంస యేరికి కావలెను?

ఆమెకుహృదయమున శల్యసంస్థాపన మయ్యెను. అగ్నిసాక్షిగఁ జేపట్టి, హైందవ సాంప్రదాయము నొదలదాల్చు కులీనకుల సంభవుఁడై, విద్యావంతుఁడైన భర్త, తన్నిట్లసహ్యముగఁజూడ నేటికని యామెకు నిరంతరము సందియము దోచుచుండెను. తనయందుగలలోటేమి? రూపమున కొంతయా? గుణములయందా? విద్యయందా? వీనియందు తనకేకొంతయుగానరాదే? పోనీ. భర్తపరనారీలోలుఁడై తనదెస విముఖుఁడైయుండెనా? అట్లనుకొనుట కాతనియందట్టి లక్షణములు గానరావే? మఱి కత మేమైయుండును? వరకట్నమై యుండునా? అదియైనచో తానేమి సేయగలదు? తనదగ్గర [illegible] సజీవుఁడైయుండినచో నిజాత్మజాశ్రేయోభిలాషచే నేదయిన ముడుపు ముట్టఁజెప్పియుండెడు వాఁడేమో? కాని అతఁడు మరణించినాఁడు. ఇకసోదరుఁడు 'దొంగలుపడిన యారునెలలకన్నట్లు' సర్వము ధడచిన వెనుక తన్నై ద్రవ్యమువెచ్చింప నిచ్చగించునా? ఇచ్చగొనినను తల్లి సమ్మతించునా? సమ్మతించి

నను వారికుటుంబపోషణార్థము విత్త మక్కర లేదా ? అదియుగాక యిల్లొనరింపుమని తా నెట్లుకోరగలదు?

అదియుగాక తనమామగారి కట్టితలంపే యున్నయెడల వివాహసమయమున వరకట్నము నిర్ణయించుకొని నిష్కర్షగా వసూలు చేసికొనియున్నచో తన కిట్టిపాట్లులేకుండెడివి గదా? ఇపు డసహాయ, అబల, అన్యులపోషణపై నాధారపడియున్నది. అట్టి బాలిక, యేమి సేయగలదు? ఇట్టి చింతనలతో నామెమనసు సంక్షోభించుచుండెను. ఈమనోవ్యాధినడంచు కొనుటకు మందు సద్గ్రంథకాలక్షేపమని తలంచి యీపనియందు నిమగ్నయై యామె కాలము గడపుకొనుచుండెను.

ప్రథమోల్లాసమునందు పేర్కొనబడిన దినమున లేఖయొకటి వచ్చెను. ఆమె కొకవిధమగు అశరీరవాణి "ఈలేఖ నీశ్వశురగృహమునుండి వచ్చిన"దని చాటుచున్నట్లుండెను. ఆలోచనాపరంపర లొక్కుమ్మడి విజృంభించి యామెహృదయసీమను కలంచివైచెను. దేహము గాలితాకుడున చలించు తీగచందంబున కంపించెను, పదములు తొట్రిలెను. ఆలేఖయందు తన భావిఫలమంతయు నిమిడియున్నదని యామె తలంచెను. ఆనందనౌకావిహారమో, అనంతదుఃఖవారిధీనిమజ్జనమో? తనగతి యెట్లున్నదో? కమ్మను దీసి చూతునా యని యామె తలపోసెను. అది యధర్మము. పరుల జాబులు చూచుట పాపహేతువు. అదియుగాక అది అన్యభాషలో వ్రాయబడియుండినచో తన కేమి లాభము? ఒకవేళ అది తన వదిన భర్తకు వ్రాసిన ప్రణయలేఖమై యున్నచో తన ప్రస్తుతావస్థయం దట్టిదానిని గాంచుట గోరుచుట్టుపై రోకటిపోటు చందమున తన బాధ నినుమడింపజేయును కదా! ఈరీతిని తర్కవితర్కములతో నామె లోని కాలేఖను గొనిపోయి, తల్లిసమీపమున బడవైచి, పర్యంకమును జేరి, పరిపరివిధముల తలపోయసాగెను.

జానకి రా వింటికివచ్చెను. తల్లి వానికా లేఖ నొసంగెను. అతఁడు వ్రాతను జూచి పోల్చుకొని తనగదిలోనికేగి యిట్లు చదువుకొనెను:—

"జానకిరావుగారికి"

నేను తమసోదరి నిక నెన్నటికిని పరిగ్రహింపజాలను. వైవాహికసమయమున వలదని వారించినను వినక మాయమ్మ యీసంబంధము నిశ్చయించి నాకుచేసినది. బలిమిని చేపట్టిన భామపై మమత యుండనేరదు. కావున నామె ముఖము నేనెన్నటికిని చూడజాలను. ఆమె ప్రశంస నికముందు నాచెవుల బడనీయకుందురుగాక యని ప్రార్థించుచున్నాను.

సుబ్బారావు"

ఈలేఖను చదివినంతనే జానకిరావున కాగ్రహ, విషాద, సంభ్రమము లొక్కమా రుదయించెను. సుబ్బారావు ద్రోహబుద్ధికై కోపమును, వాని మానసిక పరిణామమున కచ్చెరువును, తనసోదరిగతిని గూర్చి ఖేదమును మనమున చెలరేగెను. "ఔరా! దురాత్ముండెంతటిపనికి సమకట్టినాడు! పసిడిబొమ్మ వంటి బాలికామతల్లిని పాపమనియైన తలంపక

పరిత్యజించునుగా! ఇందులకు నేనేమి చేయవల యును? మనుష్యమాత్రుఁడు వేరొకని నేమి సేయగలఁడు? వీనితో బాహాబాహిని నాకసి దీర పోరాడి, నా చెలియలి కించుక యుపశాంతి గలిగించిన బాగుండును. కాని అది అధర్మము. ఏమి సేయుదును? ఆమెకీ వృత్తాంతము తెలుపకుండ ఈ లేఖను భద్రపరచి, మూకీభావము వహించుటయే శ్రేయస్కరము." అని తలంచి జానకిరావు చిత్తమును శాంతపరచికొని, యుత్తలపాటు నడంచికొని, గాంభీర్యము వహించి యూరకుండెను.

ఇఁక నిట శారదమానసికావస్థ యెట్టు లున్నది? ఆమె కేలాకో తనయన్నకు వచ్చిన కమ్మ తన్నుగూర్చియై యుండునని తోచుచుండెను. రేయింబవళ్లామె కిదియే చింత. అనుదిన మామె దుస్స్వప్నముల గాంచుచుండెను. తాను భర్తచే పరిత్యజింపబడినట్లును, భర్తపాదములపై వ్రాలి పరిగ్రహింపవలసినదని బ్రతిమాలినట్లును, ప్రాణనాథుఁ డామెతో భాషింపనైన భాషింపక పదములతో తన్ని వైచినట్లును, ఆమె కలగాంచెను. ఆమె కెట్లయిన నా లేఖ సంపాదించి చదువవలెనని కోర్కె యుదయించెను. కాని యీ కార్య మధర్మమని యామె కొన్ని దినము లోపికపట్టెను. హృదయము మామెను పరిపరివిధముల బాధింపజొచ్చెను.

తుద కొకనాడు సోదరుఁడు కార్యాంతరమున సమీప గ్రామమున కరిగినప్పుడు, శారద మెలమెల్లగ వానిగదియందు జొచ్చి, ప్రమాదవశమున శయ్యపై బడియుండిన తాళములగుత్తిని సంగ్రహించి, ఆ లేఖను గ్రహించుటకై జానకిరావు పెట్టెను తెరచెను. అందు వెదకుటయు లేఖ యామెకు దృగ్గోచరమయ్యెను. దానిని తీసి ప్రథమ వాక్యము చదువునప్పటికె కామెకన్నులు పచ్చనయ్యెను. శిరోవేదన యుదయించెను. కాళ్లు తడబడెను. గదియంతయు తిరుగుచున్నట్లు తోచెను. ఉత్తరక్షణమున నామె మూర్ఛాగ్రస్తయై నేలవ్రాలెను.

౫. పాపఫలము

సుబ్బారావు పత్నిని విడనాడినప్పటి నుండియు సిరి వానిని విడిచినట్లుండెను. ప్రథమ శాస్త్రపరీక్షయం దుత్తీర్ణుఁడగుటకు పట్టుదలతో పావుమారు వెన్ని విధములు ప్రయత్నించినను ఫలము లేకపోయెను. పదునిమిది దండయాత్రలు సాగించి, విసిగి వేసారి, ఉద్యమమును విరమించి, బొంబయినగరమున వాణిజ్యవిద్య నభ్యసింప నేగెను. అచట నాతనికి జీవనము దుర్భరమయ్యెను. స్వగ్రామశీతోష్ణస్థితులకును, బొంబయినగర శీతోష్ణస్థితులకును చాల వ్యత్యాసము గాన్పించెను. దానికితోడు బొంబయిలో శర్కరామిళితాహార సంచయమేకాని యుప్పుపులుసులు మందునకైనఁ గానరావయ్యెను. వాని కీయాహారము రుచింపలేదు. క్రమక్రమముగా సుబ్బారావున కగ్నిమాంద్య ముదయించెను. అజీర్ణవ్యాధి పీడితునకు స్వప్నములు విశేషముగా వచ్చుచుండును. సుబ్బారావున కట్టిదశ ప్రాప్తించెను. అందా తనిసతీమణి యాత్మహత్య గావించుకొనినట్లును తదాకృతి తన్ను నిరంతరమును వేధించుచుండినట్లును వానికి గనవచ్చుచుండెను.

ధ్యానిచే నాతనికి నిద్దురయునివ నపరిమితమగు భీతి యుదయించెను. నిద్రలేమిని దేహమస్వ స్థతగాంచెను. క్రమక్రమముగా నాతనికి మతి స్థైర్య మించుక చలించెనని వానిచేష్టలు గమనించుచుండిన సహపాఠులు గుర్తించిరి.

కొలదిదినముల కాతనికి బుద్ధి చలించి పోయెను. "శారదా!" యను త్ర్యక్షరీ మంత్రజపం బొనర్చుచు నతఁడు వీథులం బడి తిరుగఁజొచ్చెను. ఈవార్త మిత్రులు తంతిమూలమున రామారావుగారికి తెలియఁజేసిరి. రామారావుగారును దొరతనమువారి కొలువులోనుండుటచే పైయధికారుల సెలవులేక పోవలు లేదు గావున నాడే సెలవుదరఖాస్తు నధికారుల కంపి, భార్య కీవార్తఁదెలిపి, వీలగునంత శీఘ్రముగ బొంబయి కేగ సంసిద్ధులగు చుండిరి.

అట బొంబయినగరమున సుబ్బారావున్మాదుఁడై సంచరించుచు నొకదినమున సాయంకాలము సముద్రతీరమున కేగెను. భానుఁడపరాద్రి గ్రుంకెను. తారకాగణ పరివేష్టితుఁడగు రేరాజు తొంగిచూపుల నుర్విపై బఱుపఁజొచ్చెను. శీతకరుని కిరణజాలము లుదధిజలంబుల ప్రతిఫలించి వింతసొబగు లీనుచుండెను. పైకెగయు తుంపరలు ఆణిముత్తెములట్లు మెఱయుచుండెను. శారదరాత్రి నిట్టిదృశ్యమెవనిహృదయమును చలింపఁజేయకుండును? ఉన్మత్తుఁడగు సుబ్బారావు విషయమున నింకఁ జెప్పనేల? వాని హృదయము ప్రఫుల్లమయ్యెను. అతని కాచంద్రబింబముఖ్యముఖ సహజాలంకృత స్వరూపిణియగు, శారదాదేవి యపరావతారమగు శారద

శారద సుబ్బారావును గాంచి చిరునగ వొలయించుచు చేసైగ చేయుచున్నది.

వికసితవదనసరోజము నాతనివంకకు ద్రిప్పి, కరపల్లవములఁజాచి, తన్ను జీరుచుండినట్లు దోచెను. వానిహృదయ మానందవారిధిని దేలిపోయెను. అతఁడామె నెట్లయిన సమీపింప నెంచి, సాహసమున నీటను దుమికి, యీదుకొనుచుపోయెను. పోయిన కొలందిని పూర్ణచంద్రబింబము వానికి మృగతృష్ణవోలె దవ్వగుచుండెను. శారదయు వానిని గాంచి చిరునగ వొలయించుచు, చేసైగ జేయుచు, బిలచుచున్నట్లుండెను. దరిఁజేరుచుంటి నను కొనినకొలందిన్ని, మరల నించుకదూరమున కేగి

ఉరితినే తన్నాహ్వానించుచుండినట్లు వానికి తోచుచుండెను. అతఁడట్లే యోర్పు వహించి శక్తి వంచన లేకుండ యీదుకొని పోవుచుండెను. కొంతవడి కాతని దేహ మలసిపోయెను. అవయవములు వివశము లయ్యెను. ఆయాస మెక్కుడయ్యెను. కాళ్లాడవయ్యెను. చేతులు గుడ్డపేలికలవలె వ్రేలిపోవుచుండెను. చిట్టచివర కాతఁడు చేయునదిలేక "శారదా! శారదా!" యనియఱచుచు నగాధమున మునిఁగిపోయెను.

రామారావుగారు బొంబయి చేరిరి. కుమారునిజాడ లెఱిఁగించువారు లేరైరి. ఆయన రక్షకభటసాహాయ్యమున పట్టణమునంతయు వెదకించెనుగాని కార్యము లేకపోయెను. సుతునిజాడ తెలియక తలిదండ్రులు విచారభారవినమ్రులై యానగరమున మూడు దినము లుండిరి. మూడవదినము సాయంకాలమున సముద్రపు టొడ్డున సగము భాగము సముద్రపుచేపలచే తినివేయబడిన యొక మొండెము తేలెను. దానికి కొన్ని గుడ్డపేలికలు వ్రేలాడుచుండెను. అందు విస్ఫుటాక్షరములతో "సు. రా." అని వ్రాయబడి యుండెను. జాలరు లీశవమును బైటకీడ్చి యిసుకమీద పడవైచిరి. పలువు రచటగుమిగూడిరి. వారిలో కుమారవియోగానల దందహ్యమానమానసుఁడగు రామారావుగా రొకఁడు. ఆయన యావస్త్రములను గాంచి నంతనే తమకుమారునివని గుర్తించి, తదుపరి పైనున్న యక్షరములచేత స్థిరపరచుకొని, రక్షకభటుల కాసంగతి నెఱింగించిరి. పంచాయితీ జరిగెను. అందు పంచాయితీదార్లు, ఉన్మత్తుఁడగు సుబ్బారావను విద్యార్థి విధివశమున జలములఁబడి మునిఁగిపోయి మృతినొందెనని తీర్మానించిరి. సుతునకంత్యక్రియలు గావించి బిట్టువగతో రామారావుగారు బృందావనము జేరి, తమసోదరియగు యశోదమ్మ కీవార్త దెలియజేసిరి.

౬. చరమదశ

శారద మూర్ఛ దెలియునప్పటికి రెండు దినము లయ్యెను. ఆమెకు శిరోవేదన యుదయించెను. సుప్రసిద్ధాంగ్లాయుర్వేద వైద్యశిఖామణు లామెకు మేధోజ్వరము తగిలెననియు, ప్రాణభయము కూడ కలుగవచ్చుననియు వచించిరి. క్రమక్రమముగా జ్వర మెక్కుడయ్యెను. వారము దినములు గడచెను. దొమ్మిదవ దివసమున జ్వరము మళ్లుటయో లేక హెచ్చుటయో స్థిరపడునని భిషగ్వరులు వచించిరి. జానకిరావు ద్రవ్యమునకు లక్ష్యము సేయక తగినన్ని యుపచారము లొనరించుచుండెను.

తొమ్మిదవ దివసము వచ్చెను. నాడు జ్వరతీవ్రత యించుకతగ్గెను. ఆమె యిఁక బ్రదుకవచ్చునని వైద్యు లభిప్రాయపడిరి. కాని పాపము వారు జ్యోతిష్కులు కారు. కావున యిదమిత్థమని పూర్తిగా నిర్ణయింప లేరయిరి. శారద కొంతవడికి కనులు దెరచెను. ఎదురుగా జానకిరావు గాన్పించెను. శారద చేతులను జాచి దీనముగ 'అన్నా' యని పిలచెను. జానకిరావును విషాదముచే శిరమువంచి యామెను సమీపించెను.

శారద—"అన్నా క్షమింతువా?"

జానకి—"సోదరీ! నీవేమి తప్పొనర్చితివి?"

శా—"లేఖ చూచుట"

జా:—"సోదరీ! అదినీతప్పుకాదు, నాతప్పే. నీవృత్తాంతమై యుండినను, నీకు తెలిసినచో చింతింతువని, చెప్పక దాచితిని. కాని విధిప్రాతికూల్యమున నీ వది కనిపెట్టితివి. నాడేచూపి యుండినచో నింత చేటు మూడకుండెడిదేమో" అని జానకిరావు కనుల నీరునుంచి, పాపెకర



మును తనకరమున గీలించి "శారదా! నన్ను క్షమింపు" మనియెను. శారద నిట్టూర్పు విడిచి అన్నా! "నాహృదయభారము కొంతతగ్గిన"దని పల్కి— "ఆసంగతియేమైన"దని ప్రశ్నించెను.

"ఏసంగతి?"

"మీ భావసంగతి"

"సోదరీ! చెప్పజాల"నని కన్నీరుగార్చెను జానకిరావు.

"అన్నా! ఏమిజరిగినదో చెప్పుము. ఏమయినను నాకింక చింతలేదు. నాజీవితకాలము కొలదిక్షణములలో ముగియనున్నది. నాప్రారబ్ధమిట్లున్నది. పురాకృతజన్మఫలమిట్లున్నది కాబోలును. అన్నా! ఇంకను సందియ మెందులకు?"

"చెప్పుమనెదవా?

"చెప్పుము"

"మరణించినాడు"

"ధన్యుడు, అన్నా! నాకీ వ్యాధి గలుగకుండినచో వానిని క్షమించితినని తెలుపగోరియుంటిని. మృత్యువు సమీపించుచున్నదని నాకు తెలియును. కాని అదియు నాలస్యమయ్యెను. నాకన్న సించుకముందాయెను కాని పరలోకమునందైన నాయనను గలిసికొనిసుఖించెదకాక. సోదరా! సెలవు. విశేషించిచెప్పజాలను. అపుడే నా కాయాస మెక్కుడగుచున్నది. అమ్మ నొకసారి పంపుము" అని యామె తలగడపై శిరమువాల్చెను. జానకిరావు దుఃఖమునాపుకొనలేకపోయెను. ఈదృశ్యము చూడజాలక గదినివీడి వెలుపలికేతెంచి, తల్లిని లోనికంపి,తనశయ్యపై బడి పిల్లవానివలె నేడువజొచ్చెను.

శారద, యశోదను గాంచి ముదమార గౌగలించి ముద్దాడి ఆయాస మెక్కుడగుటచే నామెచేతులలో వ్రాలెను.

శారదాంబ యస్తమించెను. ఆమెపతియు గతించెను. శారద యశశ్చంద్రికలును సుబ్బారాయనియపకీర్తియు భూవలయమున చిరస్మరణీయములైనవి. కాని కథకునకును, పాఠకులకును గలసందియ మొక్కటే. శారదాంబను పరిత్యజించుట కేమికారణము? వైవాహికజీవనవిముఖతయా? ధనాశయా? మరేది?